క్లుప్తంగా

డ్రాఫ్ట్ లిస్ట్ అభ్యంతరాలను తెలపండి

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నగరంలో షెడ్యూల్డ్ కులాల సర్వేపై సామాజిక తనిఖీ జరుగుతోందని, దీనిలో భాగంగా డిసెంబర్ 26న నగరంలోని అన్ని సచివాలయాల్లో డ్రాఫ్ట లిస్టును ప్రచురించామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయాల్లో ప్రచురించిన లిస్టుపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 7 తేదీ లోపు వారి రాతపూర్వకంగా సంబంధిత సచివాలయంలో అందించాలని పేర్కొన్నారు. అభ్యంతరాలన్నీ ఆన్లైన్లో నమోదు చేసిన తర్వాత విచారణ చేయించి తుది జాబితాను జనవరి 17న ప్రచురిస్తామని తెలిపారు.

ప్రతిభ చూపిన చిన్నారులకు అభినందన



లబ్బీపేట(విజయవాడతూర్పు): గత ఏడాది నవంబరు 6న 600 గణిత సూత్రాలు అనర్గళంగా చెప్పి అబ్బుర పరిచి సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డు సృష్టించిన వారిలో భాగస్వాములైన 55 మంది శ్రీచైతన్య ఒలింపియాడ్ విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల రీజనల్ ఇన్చార్జి పద్మ ఆధ్వర్యాన నిర్వహించిన అభినందన సత్కార సభలో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యాలను వివిధ రూపాల్లో వెలికి తీసి ప్రపంచ రికార్డు సృష్టించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ టి.నాగేంద్ర, ఈజీఎం మద్దినేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ కొల్లి సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, స్టేట్ జోనల్ ఇన్చార్జి సౌజన్య, రోజా రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా వికాసం



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యతోనే మహిళా వికాసం సాధ్యమని అతిథులు పేర్కొన్నారు. సంఘ సంస్కర్త సావిత్రిభాయి పూలే జయంతిని పురస్కరించుకుని గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్య అకాడమి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా న్యాయవాది, ఏబీసీడీ సంస్థ వ్యవస్థాపకుడు ఆవుల వెంకట్రావు, అడ్వకేట్ కేజే ఎస్ ప్రకాశరావు పాల్గొన్నారు. తొలుత సావిత్రి బాయి పూలే, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సావిత్రి బాయి పూలే జీవిత అంశాల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని డాక్టర్ అంబేడ్కర్ యువ జన సంఘం కార్యవర్గ సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, దారా నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూచిపూడి తరుణ్ బాబు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై శనివారం పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేదికపై తిరుపతికి చెందిన శ్రీరాధిక కూచిపూడి నృత్యాలయానికి చెందిన రాధిక అశోక్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. పావని, సురేష్, గీతిక, కోమల, కళ, గౌరవి, జస్మిత, నిత్య, ఖుషీకృష్ణ, రుత్వికలు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. రెండో కార్యక్రమంగా నగరానికి చెందిన శ్రీ సరస్వతి కళాపీఠానికి చెందిన 13 మంది శిష్యబృందం భక్తి సంగీతాన్ని ఆలపించింది. పాలవర్తి ఆంజనేయ శాస్త్రి, చిట్టిబాబు, సుధా ప్రశాంతి, మదీరా, శ్రుతి పరిమ, సాయి ప్రసన్నకు పలు కీర్తనలను ఆలపించారు.

పీఏసీఎస్ కార్యాలయ ఉద్యోగుల నిరసన

ఇబ్రహీంపట్నం: పీఏసీఎస్ కార్యాలయ ఉద్యోగులకు భద్రత కల్పించాలని ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈలప్రోలులో నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈలప్రోలు పీఏసీఎస్ కార్యదర్శి పవన్ కుమార్పై స్థానికుడు బత్తుల శ్రావణ్కుమార్ చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. పీఏసీఎస్ జిల్లా ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారావు, ఇతర నేతలు పాల్గొన్నారు.

కాలనీ కమిటీల్లోనూ పచ్చ బ్యాచే!

- టీడీపీలో రెండు వర్గాలుగా 'వెలంపల్లి కాలనీ'
- నామినేటెడ్ పదవుల్లా కాలనీ కమిటీ సభ్యుల ఎంపిక
- నిబంధనలకు వ్యతిరేకంగా కీలక పదవుల్లో అద్దెదారులు
- ప్రమాణ స్వీకారం చేసిన కమిటీకి మరో వర్గం వ్యతిరేకం



450-300 ఎస్ఎఫ్టీ వెలంపల్లి కాలనీ గృహ సముదాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కాలనీ కమిటీ ఎంపికలోనూ రాజకీయం చేరింది. కాలనీ (గృహ సముదాయం) సమస్యలు లేదా అభివృద్ధి నిమిత్తం పార్టీలకతీతంగా అందరూ కలిసి ఏకాభిప్రాయంతో ఒక కమిటీని ఎన్నుకుంటారు. భవానీపురం హౌసింగ్బోర్డ్ కాలనీలో భాగమైన వెలంపల్లి శ్రీనివాస రావు నగర్ (450–300 ఎస్ఎఫ్టీ ఫ్లాట్స్) కాలనీలో అందుకు భిన్నంగా టీడీపీ కార్యకర్తలతో కూడిన కమిటీని ఎంపిక చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయాల్లో నామినేటెడ్ పదవుల పంపకంలా స్థానిక టీడీపీ నాయకులు కాలనీలో తమకు అనుకూలంగా ఉండే వారితో కమిటీ కార్యవర్గంగా నియమించుకుని ఈ నెల 2వ తేదీ రాత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. దీన్ని ఆ పార్టీలోని మరి కొందరు నాయకులు వ్యతిరేకిస్తున్నారు. త్వరలోనే తమవారితో మరో కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో ఈ తలనొప్పులు లేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నాయకులు రెచ్చిపోయి తమ మధ్య చిచ్చు పెడుతున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెలంపల్లి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో(2011) గృహ నిర్మాణ సంస్థ 450–300 ఎస్ఎఫ్టీ గృహ సముదాయాన్ని ప్రారంభించింది. డబ్బుకట్టి ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు వీటిని అప్పగించారు. దీంతో ఈ ప్రాంతవాసులు వెలంపల్లి శ్రీనివాసరావు నగర్గా నామకరణం చేసుకుని అదే పేరుతో సంఘాన్ని ఏర్పాటుచేసుకున్నారు. ఈ క్రమంలో టీడీపీకి చెందిన ఒక వ్యక్తి ఎక్కడా లేని విధంగా ఫ్లాట్స్ ఓనర్స్ అండ్ రెంటల్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశాడు. ఏ కాలనీలోనైనా ఓనర్స్ అసోసియేషన్ ఉంటుంది గానీ అద్దెకు ఉండేవారితో ఉండదని సీనియర్ సిటిజన్స్ చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా కీలక పదవుల్లో అద్దెదారులు

కాలనీలో అందరూ కలిసి కూర్చుని మంచివారితో ఒక కమిటీని ఏర్పాటు చేసుకుంటారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 42వ డివిజన్కు చెందిన టీడీపీ నాయకులు వెలంపల్లి కాలనీలో తమకు నచ్చిన వారితో ఇటీవల ఒక కొత్త కమిటీని వేశారు. కమిటీ కీలక పదవులైన అధ్యక్ష, కార్యదర్శి పదవుల్లో ఫ్లాట్ ఓనర్స్ కాకుండా అద్దెకు ఉంటున్నవారిని నియమించడం చర్చనీయాంశంగా మారింది. ఇవేమైనా నామినేటెడ్ పదవులా ఇష్టులకు కట్టబెట్టడానికి అని విమర్శలు వస్తున్నాయి. ఒక వర్గం ఎంపీ కేశినేని చిన్ని యువసేన అని, మరొక వర్గం టీమ్ బుద్దా వెంకన్న.. నాగుల్మీరా యూత్ అని కాలనీలో ఫ్లెక్సీలు కడుతున్నారు. కాలనీ సమస్యలపైగానీ, అభివృద్ధిపైగానీ వారెవరైనా పట్టించుకుంటారా..ఫ్లెక్సీలు కట్టినవారు పరిష్కరిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వెలంపల్లి శ్రీనివాసరావు నగర్ కాలనీ బోర్డ్

మదరసా విద్యార్థులకు దుప్పట్లు, స్వెట్టర్లు వితరణ



దుప్పట్లు, స్వెట్టర్లు అందుకున్న విద్యార్థులతో ఖాదర్, జానీ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక పున్నమి హోటల్ ఎదురుగా ఉన్న జామియా మహదుల్ అష్రఫ్ మదరసా విద్యార్థులకు దుప్పట్లు, స్వెట్టర్లు వితరణ చేశారు. భవానీపురానికి చెందిన షేక్ జానీ కుటుంబసభ్యుల సౌజన్యంతో శనివారం జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్ వాటిని విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాథలు, పేద ముస్లిం పిల్లలు మదరసాలో ఉంటూ చదువు నేర్చుకుంటున్నారని తెలిపారు. చలికాలంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో అందజేసినట్టు పేర్కొన్నారు. మదరసా విద్యార్థులకు సాయం చేసేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో షేక్ జానీ, మహ్మద్ ఇస్మాయిల్, భవానీపురం లారీ సప్లయర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ రఫీ, మదరసా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడి ఎన్నిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతీయ జనతా పార్టీ కుమ్మరిపాలెం మండలం (39,40,44 డివిజన్లు) అధ్యక్షుడిగా మద్ది వెంకట రాజీవ్ కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండలాధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో పరిశీలకులుగా బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, మహిళా మోర్చా నాయకురాలు బొమ్మదేవర రత్నకుమారి పాల్గొన్నారు. రిటర్నింగ్ అధికారిగా కె.శ్రీహరి, ఏఆర్ఓగా రెడ్డిపల్లి రాజు, లంకా ఆనంద శర్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, పచ్చిపులుసు శివ ప్రసాద్, గన్నవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాబ్మేళాలో 25 మంది ఎంపిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జేకేసీ, కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్ మేళాలో 25 మంది ఎంపికయ్యారు. జాబ్ మేళాకు మొత్తం 95 మంది హాజరు కాగా దివీస్ ల్యాబొరేటరీ వారు 25 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో జవహర్ నాలెడ్జి సెంటర్ కోఆర్డినేటర్ జీ విజయ్ దీప్, ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

నాగమానసాదేవికి ప్రత్యేక పూజలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్లోని ఓం షిర్డీ సాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి అభిషేకాలు చేశారు. రకరకాల పూలతో స్వామివారిని అభిషేకించారు. ఈ సందర్భంగా వందలాది భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

15 నుంచి సర్వీస్ ప్రొవైడర్లకు ఉచిత శిక్షణ



యూసీడీ అధికారులకు సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్కు దరఖాస్తులు సమర్పిస్తున్న దృశ్యం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో నివసించే వివిధ రకాల సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించి వారికి నైపుణ్య సాంకేతిక శిక్షణ ఇవ్వడానికి వీఎంసీ కృషి చేస్తోందని ప్రాజెక్ట్ ఆఫీసర్ యూసీడీ విభాగం అధికారి వెంకటనారాయణ తెలిపారు. ఈ మేరకు నగరంలోని సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించడానికి గవర్నర్పేటలోని ఐవీ ప్యాలెస్లో శుక్ర, శనివారాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 700 మంది సర్వీస్ ప్రొవైడర్లు శిక్షణ పొందడానికి దరఖాస్తు చేసుకోగా వారందరికీ జనవరి 15 నుంచి శిక్షణ అందిచనున్నామని తెలిపారు. ఇందులో ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటి మరమ్మతులు చేసేవారు పెయింటర్, బ్యూటీషియన్(స్త్రీలైనా, పురుషులైనా) తదితర తగిన నైపుణ్య సాంకేతిక శిక్షణ సర్టిఫికెట్ ఇవ్వటంతో పాటు జీవనోపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

ఈఎన్టీ వైద్యుల సంఘానికి నూతన కమిటీ



డాక్టర్ శివరామ్ అక్కినేని, అధ్యక్షుడు



డాక్టర్ తన్వీర్ అఫ్రోజ్, కార్యదర్శి



డాక్టర్ వింధ్యచౌదరి, కోశాధికారి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈఎన్టీ వైద్యుల సంఘం నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ సర్వసభ్య సమావేశం శనివారం గవర్నర్పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ శివరామ్ అక్కినేని, కార్యదర్శిగా డాక్టర్ తన్వీర్ అఫ్రోజ్, కోశాధికారిగా డాక్టర్ వింధ్యచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక కార్యక్రమం ఈఎన్టీ సీనియర్ వైద్యుడు పీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఎంఏ రెహమాన్, డాక్టర్ మధుసూదనశర్మ, డాక్టర్ మన్నే వెంకటరత్నం సమక్షంలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ శివరామ్ అక్కినేని మాట్లాడుతూ ప్రజలకు ఈఎన్టీ సమస్యలపై మరింత అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా ఆరోగ్యం మెరుగుకు కృషి చేస్తామని తెలిపారు.





పుస్తక ప్రియుల సందడి

నగరంలో బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో శనివారం పుస్తక ప్రియుల సందడి కనిపించింది. బుక్ స్టాల్స్ను విద్యార్థులు, పెద్దలు సందర్శించి కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేశారు. చరిత్ర, ఆధ్యాత్మికం, ఆర్థికం, రాజకీయం, పోటీ పరీక్షలు తదితర పుస్తకాలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. పలు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. న్యాయమూర్తులు, రచయితలు, సినీ నిర్మాతలు, దర్శకులు పుస్తకావిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





మానవాళికి మహోదయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్.వెంకట్రావు, చిత్రంలో బండ్ల సాంబశివరావు, రచయిత డి.పాపారావు

ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



క్యూలైన్ల వద్ద అపరిశుభ్ర వాతావరణాన్ని ఫొటో తీస్తున్న ఇన్చార్జి ఈవో రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి ఆలయ పరిసరాలతో పాటు ఆలయానికి చేరుకునే ఘాట్రోడ్డు, కనకదుర్గనగర్ మార్గాన్ని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని దుర్గగుడి ఇన్చార్జి ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని క్యూలు, ప్రధాన ఆలయం, ఘాట్రోడ్డును రామచంద్రమోహన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి గేట్పాయింట్ వద్ద చెత్త, ఇనుప రాడ్లు, ఇతర సామగ్రి ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలోకి ప్రవేశించే మార్గం ఇలాగేనా ఉండేదంటూ అధికారులను ప్రశ్నించారు. క్యూలో దుమ్ము పట్టి ఉన్న ఫ్యాన్లను చూసి వెంటనే వాటిని శుభ్రం చేయాలని ఆదేశించారు.

ఘాట్రోడ్డులోని మొదటి మలుపు నుంచి డోనర్ సెల్ వరకు కొండ వైపు చెత్త పేరుకుపోయిందని, 24 గంటల్లో శుభ్రం చేయాలని ఆదేశించారు. శానిటేషన్పై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన ఆలయ పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే సుమారు 25 మంది శానిటేషన్ సిబ్బంది ఘాట్రోడ్డుతో పాటు ఆలయ పరిసరాలు, క్యూలైన్లను శుభ్రం చేస్తూ కనిపించారు. ఇటీవల భవానీ దీక్షలు ముగియడం, ఆ తర్వాత నూతన సంవత్సరం రద్దీ, సీఎం అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నేపథ్యంలోనే బారికేడ్లు, ఇతర ఇనుప సామగ్రి ఆలయ పరిసరాల్లో ఉన్నాయని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

మహిళలకు చేనేత వస్త్రధారణ పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న అంబటి మధుమోహనకృష్ణ, వేదికపై శ్రీదేవి తదితరులు

విజయవాడ కల్చరల్: మహిళలకు చేనేత వస్త్రాలు శోభనిస్తాయని పారిశ్రామిక వేత్త అంబటి మధుమోహన కృష్ణ అన్నారు. ఏపీ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి, శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా మహిళలకు చేనేత వస్త్రధారణ పోటీలు, విజేతలకు బహుమతి ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మధుమోహనకృష్ణ మాట్లాడుతూ మహిళా సాధికారతను స్వాగతించాలని సూచిస్తూ సంస్థ ద్వారా ఏటా వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సేవా సమితి వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం, నైతిక విలువలు, మహిళల విజయాలను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. విజయవాడ దూరదర్శన్ బాధ్యుడు కొండలరావు, స్థానిక కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు, సినీ నటుడు గోల్డెన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 500 మంది పోటీల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులను అందజేశారు. నాట్యాచార్యుడు కేజీ మోహన్ గిరిజా కల్యాణం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఆర్జే రామ్, నవీన్ నిర్వహించారు.

అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించాలి

స్కేటర్ హాశీష్ను అభినందించిన ఎంపీ కేశినేని చిన్ని



స్కేటర్ హాశీష్ను అభినందిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయ పతకం సాధించి జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని చాటాలని స్కేటర్ మెరుగుపాల హాశీష్కు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సూచించారు. తమిళనాడులోని పొల్లాచిలో ఇటీవల జరిగిన జాతీయ ఆర్టిస్టిక్ స్కేటింగ్ పోటీల అండర్–14 ఇన్లైన్ ఫ్రీ స్టైల్లో బంగారు పతకం సాధించిన హాశీష్ను తన కార్యాలయంలో ఎంపీ చిన్ని శనివారం అభినందించారు. ఇదే క్రీడా స్ఫూర్తిని అంతర్జాతీయ క్రీడా వేదికపైనా ప్రదర్శించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని, హాశీష్ను ప్రోత్సహిస్తున్న అతని తల్లిదండ్రులు శివమాధవి, రాజును ఎంపీ ప్రశంసించారు.

దేశ చారిత్రక మూలాలు అధ్యయనం చేయాలి



ప్రసంగిస్తున్న సామవేదం

విజయవాడ కల్చరల్: మన దేశ చారిత్రక మూలాలు తెలియాలంటే పురాణాలు చదవాలని ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఋషిపీఠం విజయవాడ, భారతీయ సనాతన వేదిక ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న 'మన కోసం మన పురాణాలు' అంశంగా నిర్వహిస్తున్న ప్రసంగాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో భారతీయ సనాతన ధర్మం, మూలాలు, పురాణాల్లో శాస్త్ర విజ్ఞానం అంశంగా ప్రసంగించారు. కవులకు పురాణాలు స్ఫూర్తినిస్తాయని చెప్పారు. తెలుగులో వచ్చిన కావ్యాలకు పురాణాలు ప్రేరణ కలిగించాయన్నారు. సనాతన ధర్మం సంపూర్ణ జీవితం గురించి శాస్త్రీయంగా వివరిస్తుందని పేర్కొన్నారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం విశ్రాంత కార్యనిర్వహణ అధికారి కేఎస్ రామరావు కార్యక్రమాలను ప్రారంభించి ప్రసంగించారు. యువత, విద్యార్థులు సనాతన ధర్మంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కేబీఎస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, యాబలూరి లోకనాథశర్మ, ఋషిపీఠం ట్రస్టీ మారెపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పద్య నాటకానికి పూర్వ వైభవం తీసుకురావాలి



కలియుగ వైకుంఠంలోని ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: పద్యనాటకానికి పూర్వవైభవం తీసుకురావాలని శ్రీనివాసా నాట్యమండలి వ్యవస్థాపకుడు దత్తుబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, శ్రీనివాసా నాట్య మండలి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే పద్యనాటక మహోత్సవాలు గాంధీనగర్లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం ప్రారంభమయ్యాయి. దత్తుబాబు మాట్లాడుతూ సత్యహరిశ్చంద్ర, పాండోద్యోగ విజయాలు, చింతామణి నాటకాలను నేటికీ ప్రజలు ఆదరిస్తూనే ఉన్నారన్నారు. తిరుపతి వెంకటకవులు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, బలిజేపల్లి లక్ష్మీకాంత కవి లాంటి వారు తెలుగు పద్యనాటకానికి జీవం పోసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారులు ప్రసాద్బాబు, పి కోటినాగులు, బుజ్జి సాహెబ్ సోని తదితరులు పాల్గొన్నారు. దత్తు పర్యవేక్షణలో కలియుగ వైకుంఠం, గయోపాఖ్యానం, మోహినీ విజయం, శ్రీకృష్ణ రాయబారంలోని పడక ఘట్టాన్ని ప్రదర్శించారు. నాటక ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుల జాబితాలో తప్పులను సరిచేయండి

విజయవాడరూరల్: రూరల్ మండలంలోని సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన షెడ్యూల్ కులం (మాదిగ) జాబితాల్లో కొన్ని తప్పిదాలను సరిచేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద వెంకటేశ్వరరావు మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ బి.సుగుణకు శనివారం వినతి పత్రం అందజేశారు. మాదిగ కులస్తులకు బదులుగా మాల కులస్తులని కొన్ని తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేయాలని వెంకటేశ్వరరావు కోరారు. హిందూ మతానికి బదులు క్రిస్టియన్ అని, ఆధార్ కార్డ్, రేషన్కార్డు కలిగి ఉన్న పేర్లు సైతం కొన్ని జాబితాలో లేకపోవడం గుర్తించామని వాటిని కూడా సరిచేయాలని కోరారు.